సాక్షి
సంగారెడ్డి

ఆదివారం । 14 । జూలై । 2024



తారెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

జహీరాబాద్ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్లు నిత్యం కాలిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 8లో ▸



'మహిళ'కు పెద్దపీట

గ్రామాలలో మహిళా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టింది. వివరాలు 9లో ▸



బడికి పోయేదెలా?

చింతలపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లడానికి దారి కూడా సరిగా లేదు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

తెల్లాపూర్‌లో వైభవంగా జగన్నాథ్ రథయాత్ర



జగన్నాథ్ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జగన్నాథ్ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శనీశ్వరునికి పూజలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శనీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆశ్రమ ఆవరణలో శనీశ్వర విగ్రహానికి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి తైలాభిషేకం, మహా మంగళ హారతి తదితర పూజలు చేశారు. అలాగే ఆశ్రమ ఆవరణలో హనుమాన్ మొక్క నాటారు. ఆలయ అర్చకులు శివ శంకర్ స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

10మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రాజేశ్ నాయక్

మునిపల్లి(అందోల్): పది మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు. శనివారం రాత్రి కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ రూపేశ్ ఆదేశాలతో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మందిని పట్టుకున్నామని చెప్పారు. అక్రమంగా రవాణా అవుతున్న మాదక ద్రవ్యాలను అరికట్టడానికి 30మంది సిబ్బందితో తనిఖీలు చేపట్టామని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వసతులు లేవు



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో తల్లిదండ్రుల వాగ్వాదం

రామాయంపేట(మెదక్): పాఠశాలలో కనీస వసతులు కూడా లేవు.. కాంట్రాక్టర్ విద్యార్థినులకు సరైన భోజనం పెట్టడం లేదు. పాఠశాల ఆవరణ చెత్తా చెదారంతో పేరుకుపోయింది. తరచూ ఎలుక లు గదుల్లోకి వస్తున్నాయి. పలుమార్లు ఉపాధ్యాయులకు చెప్పినా ఫలితం లేకుండాపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం రామాయంపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిరసన తెలిపారు. మరుగుదొడ్లకు సరిగా నీటి సరఫరా లేక దుర్వాసన వెదజల్లుతోందని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా తిను బండారాలను ఉపాధ్యాయురాలే స్కూల్‌లో విక్రయిస్తోందని ఆరోపించారు. ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడంతో తరచూ పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ భీమయ్య మాట్లాడుతూ.. విద్యార్థినులను ఎలుకలు కొరికిన విషయమై తప్పు జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘట నలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసంఘటనకు సంబంధించి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు.

● సకుటుంబ సమేత..

హోం టాకీస్..!

పెరుగుతున్న క్రేజ్



- పల్లెలకు పాకిన హోం థియేటర్ కల్చర్
- ఓటీటీల రాకతో మరింత డిమాండ్
- రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షలు వరకు ఖర్చు
- నచ్చినట్లు గదిని డిజైన్ చేస్తున్న ప్రముఖ కంపెనీలు
- ఆ అనుభూతే వేరంటున్న వీక్షకులు

రియల్ లైఫ్‌ను రీల్ లైఫ్‌లోకి ఎక్కించి కోట్లాది మంది మనసులను దోచేస్తున్నది సినిమా. వీధి నాటకాలతో మొదలై నేడు విశ్వవ్యాప్తంగా సినిమా అనేక రూపాలను సంతరించుకుంది. ఎడిటింగ్ మాయతో ఎన్నో మార్పులు చోటు చేసుకున్న సినిమాకు తరాలు మారినా ఆదరణ తగ్గడంలేదు. అప్పట్లో వీధుల్లో తెర వేసి ఆడించిన సినిమాను నేటి తరం హోం థియేటర్‌లో చూసే స్థాయికి ఎదిగింది. ఓటీటీ సైతం అందుబాటులోకి రావడంతో మరింత డిమాండ్ పెరిగింది. పట్టణాల నుంచి పల్లెలకు ఈ కల్చర్ పాకింది. నచ్చిన డిజైన్ కోసం ఖర్చుకు వెనుకాడటం లేదు. హోం థియేటర్‌లో సినిమా చూస్తే.. ఆ అనుభూతే వేరంటూ వీక్షకులు తెగ సంబరపడిపోతున్నారు.

- పర్చ శ్రీనాథ్, రామచంద్రాపురం (పటాన్‌చెరు):
బొడ్డు రవి, శివ్వంపేట (నర్సాపూర్):

8లో



ప్రాణం పోయినా భూములివ్వం



హైవేపై భూ నిర్వాసితుల ధర్నా

నర్సాపూర్ రూరల్: పాత అలైన్‌మెంట్ ప్రకారమే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించాలని రెడ్డిపల్లి గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. సర్వేను అడ్డుకొని నర్సాపూర్– మెదక్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కొంతమంది బడా నేతలు, వ్యాపారుల కోసం ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు ఏర్పాటు చేయకుంటే ప్రాణాలకు తెగించి పోరాడుతామని హెచ్చరించారు. గతంలో కాళేశ్వరం కాలువ, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ లైన్ కోసం భూములు కోల్పోయి తీవ్ర అన్యాయానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. సుమారు రెండు గంటల పాటు చేపట్టిన ధర్నాతో ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

కాంగ్రెస్ గూటికి గూడెం..?

- రేవంత్ నివాసానికి వెళ్లిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- హస్తం గూటికి చేరుతున్నట్లు ప్రచారం
- కొడుకు వాట్సాప్ స్టేటస్‌పై చర్చ
- గూడెం చేరికపై కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యతిరేకత
- అందుకే చేరిక వాయిదా పడిందనే వార్త చక్కర్లు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అక్రమ మైనింగ్ కేసులు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు.. భూకబ్జాల ఆరోపణలు.. ఇలా పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఆయన పార్టీ మారుతారని కొంత కాలంగా జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ శనివారం మహిపాల్‌రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఆయనతో కలిసి రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. సీఎంతో ఎమ్మెల్యే భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యే..

గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో గులాబీపార్టీ నుంచి విజయం సాధించారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సుమారు తొమ్మిదిన్నరేళ్లలో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడినట్లు మహిపాల్‌రెడ్డిపై ఆరోపణలున్నాయి. భూకబ్జాల ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిపాల్‌రెడ్డి మైనింగ్ క్వారీలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టిన విషయం విదితమే. దీనికి సంబంధించిన కేసులో ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డిపై పోలీసు కేసు నమోదైంది. రిమాండ్‌కు కూడా తరలించారు. ఈ క్రమంలోనే ఆయన నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీ మారుతారనే ప్రచారం జరిగింది. ఈడీ కేసుల నేపథ్యంలో ఆయన బీజేపీలోకి వెళతారనే చర్చ కూడా జరిగింది. ఇటీవల మహిపాల్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన బీబీ పాటిల్‌ను కలిశారు. దీంతో ఆయన కమలం గూటికి చేరే అవకాశాలు లేకపోలేదనే ఊహాగానాలు వినిపించాయి. కానీ అనూహ్యంగా ఆయన కాంగ్రెస్ గూటికి చేరేందుకు రంగం సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది.

'స్టేటస్' సింబలా..

మహిపాల్‌రెడ్డి కుమారుడు విక్రంరెడ్డి తన వాట్సాప్ స్టేటస్‌లో కొన్ని ఫొటోలను షేర్ చేశారు. తన తండ్రి గూడెం మహిపాల్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహలతో కలిసి గతంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఫైల్ ఫొటోలను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. అనుకున్నట్లుగానే శనివారం సాయంత్రం మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం జరిగి పోయింది.

ప్రచారం నిజమయ్యేనా?

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం ఏడుగురు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గెలుపొందిన విషయం తెలిసిందే. వీరిలో ఐదుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతారనే ప్రచారం ఉంది. మూడు నెలల క్రితమే గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మాణిక్‌రావులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ సంబంధిత సమస్యను పరిష్కరించాలని కోరేందుకే సీఎంను కలిసినట్లు అప్పట్లో ప్రకటించారు. తీరా ఇప్పుడు మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

గ్రేటర్ ఎమ్మెల్యేల బాటలో..

రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మొత్తం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు ఇటీవల హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. పటాన్‌చెరు కూడా ఈ గ్రేటర్ పరిధిలోనే ఉంది. రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన గ్రేటర్ ఎమ్మెల్యేల బాటలో గూడెం కూడా అడుగులు వేస్తున్నారు.

త్వరలో చెబుతా..

పార్టీ మారుతారనే ప్రచారం నేపథ్యంలో గూడెం మహిపాల్‌రెడ్డిని 'సాక్షి' ప్రతినిధి 'ఫోన్'లో సంప్రదించగా... ఏదైనా సమాచారం ఉంటే చెబుతానని స్పష్టం చేశారు.

హైడ్రామా..

పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారని నియోజకవర్గంలో ప్రచారం జరిగింది. ఇందుకోసమే శనివారం సాయంత్రం ఆయన సీఎం రేవంత్ ఇంటికి వెళ్లారనే వార్తలు వినిపించాయి. అయితే మర్యాదపూర్వకంగా నియోజకవర్గ అభివృద్ధి అంశం చర్చించేందుకు వెళ్లారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. శనివారం రాత్రే మహిపాల్ కాంగ్రెస్‌లో చేరుతున్నారని వార్తలు వచ్చినా, అది ఆదివారానికి వాయిదా పడిందనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో నెలకొంది. ముఖ్యంగా ఎమ్మెల్యే చేరికను స్థానిక కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్, కాటా శ్రీనివాస్‌గౌడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలిసింది. మంత్రి దామోదర వద్ద వారు తమ అభ్యంతరం వ్యక్తం చేశారని, అందుకే తుది నిమిషంలో ఎమ్మెల్యే చేరిక వాయిదా పడిందని చెబుతున్నారు.

గూడెం చేరిక బాధాకరం : కాటా శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీని అణిచివేసేందుకు కర్కశంగా వ్యవహరించిన గూడెం మహిపాల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం సముచితమైన నిర్ణయం కాదని, దీనిని వ్యతిరేకిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యేపై పదేళ్లు పోరాటం చేసి కాంగ్రెస్‌ను బతికించుకున్నామని చెప్పారు. అనేక దౌర్జన్యాలు, ఆక్రమణలు, అక్రమాలు చేసిన మహిపాల్ రెడ్డి తన ఆస్తులు కాపాడుకునేందుకు అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో గందరగోళం

మహిపాల్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో ఉన్నారని.. కాంగ్రెస్‌లో చేరుతున్నారనే ప్రచారం జరగడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే చేరికపై తమకు ఏ సమాచారం లేదని ఆయన అనుచరులు 'సాక్షి'కి తెలిపారు. అయితే అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం మాత్రం ఎమ్మెల్యే తోపాటే తమ రాజకీయ భవిష్యత్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఎక్కువ కేసులు పరిష్కరించండి

హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి



అదనపు సబ్ కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి మాధవీదేవి

సంగారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో నూతనంగా నిర్మించిన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులను హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అధిక మొత్తంలో కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు కృషి చేయాలని, ఇందుకోసం కొత్త భవనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత భోజన వసతి, గ్రంథాలయాన్ని ఆమె సందర్శించి ప్రశంసించారు. సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదులు జడ్జికి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఆర్‌ఎండీ అతిథి గృహం వద్ద కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేశ్ జడ్జికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూతోనే కార్మికుల సంక్షేమం

రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: సీఐటీయూతోనే కార్మికుల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్ పిరామిల్ కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిరామిల్ కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపిస్తే కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కర్మాగారాల్లో జరగని విధంగా వేతన ఒప్పందం చేయిస్తామని చెప్పారు. అగ్రిమెంట్‌ను డేట్ టూ డేట్ చేస్తామని, ప్రొడక్షన్ లాభాల్లో గిఫ్ట్ ఇప్పిస్తామన్నారు. ఎంప్లాయీస్ కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని, కార్మికుల రిటైర్మెంట్ వయసు పెంపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యదర్శి సాయిలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, జిల్లా కార్యదర్శి మహిపాల్, నాయకులు రాజిరెడ్డి, పాండురంగారెడ్డి, గణేష్, వంశీ, సందీప్‌రెడ్డి, నర్సింలు, నారాయణ, నర్సయ్య పాల్గొన్నారు.

శివపంచాక్షరీ మహామంత్ర కోటి జపయజ్ఞం



మాట్లాడుతున్న కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యులు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని బసవ సేవా సదన్ ఫంక్షన్ హాలులో శనివారం నుంచి తొమ్మిదిరోజుల పాటు నిర్వహించనున్న శివ పంచాక్షరీ మహామంత్ర కోటి జపయజ్ఞం సామూహిక లింగార్చన కార్యక్రమాన్ని కాశీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్య మంత్రోపదేశంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని, దీనిద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని వివరించారు. సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల లోకమంతా సుభిక్షంగా సుఖ సంతోషాలతో విరాజిల్లుతుందన్నా రు. కార్యక్రమంలో వీరశైవ సమాజం చౌకిమఠం అధ్యక్షులు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, కోశాధికారి పులుమామిడి వీరేశం, గౌరవ అధ్యక్షులు బొడగామ శ్రీశైలం పాల్గొన్నారు.

ఐడియా.. అదుర్స్





వర్షాకాలం సీజన్ ప్రారంభమై సుమారు 45 రోజులు పూర్తికావొస్తున్నా ఇప్పటివరకు సరైన వానలు కురవలేదు. అడపాదడపా పడిన జల్లులకు రైతులు విత్తనాలు విత్తుకున్నారు. అప్పటి నుంచి చినుకు జాడలేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొలకెత్తిన పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొందరు రైతులు బారుబావుల కింద ఉన్న పత్తి, సోయా పంటలకు పైపులు, స్పింక్లర్ల ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు. నీటి వనరులు లేని రైతులు మాత్రం వాన కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కంగ్టి(నారాయణఖేడ్):

క్లుప్తంగా


రవిప్రసాద్‌శర్మకు భారతీయ నంది నేషనల్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రవిప్రసాద్‌శర్మ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామ పురోహితుడు, చిలప్‌చెడ్ మండల సర్వేయర్ రవిప్రసాద్‌శర్మకు భారతీయ నంది నేషనల్ అవార్డు వచ్చినట్లు శనివారం తెలిపారు. సామాజిక సేవలకు గుర్తింపుకు గాను సర్వీసెస్ సొసైటీ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ డాక్టర్ ఆకుల రమేశ్ స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అవార్డును ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట భారీ మోసం

రూ.6.49 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి వారు భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని గ్రీన్ విడోస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 19వ తేదీన ట్రేడింగ్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకు ను ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు. అతడికి ఐడీ క్రియేట్ చేసి ఇవ్వగా నగదు ఆన్‌లైన్ లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.6 లక్షల 49 వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదు తో పాటు లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రేపు చలో కలెక్టరేట్

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఈ నెల 15న చలో సిద్దిపేట కలెక్టరేట్ పిలుపులో భాగంగా పాదయాత్ర నిర్వహించనున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. అల్వాల నుంచి తొగుట మండలం గుడికందుల వరకు ఉన్న రోడ్డు మరమ్మతు నిర్మాణం పనులు పూర్తి కాలేదన్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అల్వాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15న పాదయాత్రగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామని స్పష్టం చేశారు.


భారతీనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఐజీ కాలనీలో సినిమా చూస్తున్న దృశ్యం

హోం టాకీస్..!

ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి సినిమా


ఓ ఇంటిలో ఏర్పాటు చేసిన థియేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ఉమ్మడి జిల్లాలో సుమారు 50 పైగా సినిమా థియేటర్లున్నాయి. ఓటీటీల కారణంగా థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతుంది. దీంతో పలు చోట్ల థియేటర్‌లను సైతం మూసివేసే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఓటీటీ స్ట్రీమింగ్ సేవలు ప్రముఖ మార్కెట్‌గా మారుతుంది. దీంతో పలు సంస్థలు వినియోగదారులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. చాలా మంది థియేటర్ అనుభూతి కోసం ఇంట్లోనే హోమ్ థియేటర్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. తెల్లాపూర్ మున్సిపరిధిలో దాదాపు 25 శాతం ఇళ్లలో థియేటర్లు ఉండగా, ఇక గేటెడ్ కమ్యూనిటీ ఏరియాల్లో 30 శాతంపైగా ఇళ్లలో హోమ్ థియేటర్లు ఏర్పాటు చేసుకున్నారు.

ప్రత్యేక గది డిజైన్

కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు నిర్మాణంలో భాగంగా హోమ్ థియేటర్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. మధ్య తరగతి ప్రజలు సైతం దీనిపై ఆసక్తి చూపుతున్నారు. అందుకు కోసం ప్రత్యేకంగా ఒక గదిని డిజైన్ చేయిస్తున్నారు. మరి కొంత మంది ఖర్చుకు వెనుకాడకుండా హోమ్ థియేటర్ గదికి సౌండ్ ప్రూఫ్ ఏర్పాటు చేస్తున్నారు.

థియేటర్లకు వెళ్లని జనం..

సండే స్పెషల్

చాలా మంది ఇంట్లోనే కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సినిమా చూడడానికి ఆసక్తి చూపుతున్నారు. సినిమా థియేటర్‌కు వెళ్లాలంటే ప్రత్యేక సమయం కేటాయించడంతోపాటు టికెట్‌ను క్యూలో నిలబడి తీసుకోవడం లేదా ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలి. సినిమా టికెట్, తినుబండారాల ధరలు పెరగడంతో కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు పోవాలంటే ఖర్చుతో కూడుకున్నదే. ఒక చిన్న కుటుంబం వారు సినిమాకు వెళ్లాలంటే సుమారు రూ.2 వేలు ఖర్చు వస్తుంది. దీంతో చాలా మంది సినిమా థియేటర్‌లకు వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు.

ఓటీటీలతో మరింత డిమాండ్

మార్కెట్ ఓటీటీ సేవలతో హోమ్ థియేటర్‌లకు మరింత డిమాండ్ పెరిగింది. కోవిడ్ తర్వాత సినిమా థియేటర్‌లో విడుదలయ్యే కొత్త సినిమాలు వారం రోజులు లేదా మరుసటి రోజే ఓటీటీల్లో రావడం, మరికొన్ని సినిమాలు డైరెక్ట్‌గా ఓటీటీలోనే విడుదల కావడంతో చాలా మంది తక్కువ ఖర్చుతో ఇంట్లోనే సినిమా చూడటానికి ఇష్టపడుతున్నారు. ప్రధానంగా వెబ్‌సిరీస్‌లు ఎక్కువగా ఓటీటీలలో రావడంతో చాలా మంది హోమ్‌థియేటర్ ఏర్పాటుకు ఎంత ఖర్చు అయినా వెనుకాడడం లేదని వ్యాపారస్తులు చెప్పుకొస్తున్నారు.

నాణ్యత బట్టి ధరలు..

ఇంట్లో హోమ్ థియేటర్ ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు రూ.5 లక్ష నుంచి రూ.8 లక్షలు ఖర్చువుతుందని హోమ్‌థియేటర్ వ్యాపారస్తులు చెబుతున్నారు. స్క్రీన్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తారు. గది మరింత విశాలంగా ఉంటే సుమారు రూ.50 లక్షలు ఖర్చు అవుతుంది. తక్కువ ధరకు లభించే హోమ్ థియేటర్‌లు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సినిమా థియేటర్‌లో చూసిన ఫీలింగ్ రావాలంటే ప్రముఖ కంపెనీల పరికరాలను అమర్చుకోవాలి. మధ్య తరగతి వారికి అనుకూలంగా ధరలు ఉండటంతో ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

గ్రామాల్లోనూ హోమ్ థియేటర్లు

శివ్వంపేట(నర్సాపూర్): ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన హోమ్ థియేటర్ కల్చర్ ఇప్పుడు గ్రామాల్లోకి విస్తరించింది. థియేటర్లో సినిమా చూసే అనుభూతి ఇంట్లో చూసే విధంగా హోమ్ థియేటర్ నిర్మాణాలు చేపట్టారు. నూతన ఇంటి నిర్మాణంలో పలువురు హోమ్ థియేటర్ ఉండేలా ప్రణాళిక చేసుకుంటున్నారు. పెద్ద తెర ఏర్పాటు చేసుకొని డీలక్స్ సీట్లు ఏర్పాటు చేసుకున్నారు. శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేశ్ గుప్తా తన ఇంట్లో హోమ్ థియేటర్ ఏర్పాటు చేసుకున్నాడు.


శివ్వంపేటలో హోమ్ థియేటర్

గది సైజును బట్టి ధర



మేము నాణ్యత బట్టి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు హోమ్ థియేటర్ ఏర్పాటు చేస్తున్నాం. హోమ్ థియేటర్ ఏర్పాటు చేసుకొనే గది సైజును బట్టి ధర ఉంటుంది. కొత్త సినిమాలు విడుదలైన వారం రోజుల్లో ఓటీటీల్లో రావడంతో ఎక్కువ మంది హోమ్ థియేటర్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం హోమ్‌థియేటర్ ఒక స్టేటస్ సింబల్‌గా మారింది.

– అమిత్ చౌదరి, హిల్ట్ లైఫ్ కంపెనీ అధినేత

కుటుంబ సభ్యులతో కలిసి చూస్తున్న



కొత్త ఇళ్లు నిర్మించుకునే సమయంలోనే హోమ్ థియేటర్‌కు ప్లాన్ చేశాం. ఇంట్లో హోమ్ థియేటర్‌కు రూ.30 లక్షలు ఖర్చయింది. సమయం దొరికినప్పుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా ఇంట్లోనే సినిమా చూస్తున్నాం. హోమ్ థియేటర్ ఇంట్లోనే ఉండడంతో సినిమా థియేటర్‌కు వెళ్లే అవసరం లేదు.

– అరవ రామకృష్ణ, వ్యాపారవేత్త

టికెట్‌ల కోసం లైన్‌లో నిలబడేది



గతంలో సినిమా థియేటర్‌లు తక్కువగా ఉండేవి. సినిమా చూడాలంటే టికెట్ కోసం లైన్‌లో నిలబడేవాళ్లం. గ్రామాల్లో తెర్పై సినిమా వేసే వారు. నడుచుకుంటూ వెళ్లి సినిమాలు చూసి వచ్చేవాళ్లం. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో అందరితో కలసి ఇంట్లోనే కొత్త సినిమా చూసే రోజులు వచ్చాయి.

– పర్సా రామ్మోహన్ రావు, సీనియర్ సిటిజన్

సినిమా థియేటర్‌లకు ఎఫెక్ట్



గతంలో సినిమా థియేటర్‌లకు మంచి డిమాండ్ ఉండేది. కొత్త సినిమా వస్తే అభిమానులు పెద్ద ఎత్తున థియేటర్ వద్దకు వచ్చి హంగులు ఆర్భాటాలతో సందడి చేసేవారు. ఓటీటీలు రావడంతో ఎక్కువ మంది సినిమాలను ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి చూస్తున్నారు. సింగిల్ స్క్రీన్ సినిమా థియేటర్ రంగానికి నష్టం తప్పడం లేదు.

– దేవేందర్ రాజు, శ్రీ వెంకటేశ్వర (ఎస్‌వీఎస్) థియేటర్ యజమాని

గంజాయి విక్రేతల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్


నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ములుగు(గజ్వేల్) : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బండమైలారం గ్రామ శివారులో గల సన్‌సిటీ వెంచర్‌లో కొందరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారని సమాచారం అందింది. అక్కడ ముగ్గురు వ్యక్తులు రెండు బైక్‌లతో ఓ చెట్టు కింద కూర్చొని ఉన్నారు. పోలీసుల రాకను గమనించి పారిపోతుండగా పట్టుకొని బైక్‌లను పరిశీలించగా గంజాయి లభ్యమైంది. విచారణలో కర్ణాటక రాష్ట్రం గొండగవన్, బీదర్‌కు చెందిన గవర్నగర్ మహేశ్(28), జార్ఖండ్ రాష్ట్రం పరాసిఇచక్, హజారిబాగ్‌కు చెందిన సద్దాం హుస్సేన్(27), మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా సుతారిగూడకు చెందిన మహ్మద్ అబ్దుల్ సమీర్(26)గా తేలింది. కొంత కాలంగా దుండిగల్‌లోని పద్మ అనే మహిళ వద్ద గంజాయిని కొనుగోలు చేసి బండమైలారం, చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి 137.76 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

మరో కేసులో ఇద్దరు రిమాండ్

పటాన్‌చెరుటౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని కొల్లూరు సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు టోల్ గేట్ వద్ద శనివారం ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న కొండాపూర్‌కు చెందిన వంశీని పట్టుకొని అతడి వద్ద 75 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడని అదుపులోకి తీసుకొని విచారించగా ఖజాగూడకు చెందిన శివకృష్ణ వద్ద నుంచి తెచ్చానని చెప్పాడు. అనంతరం శివకృష్ణ ఇంటిలో తనిఖీలు చేయగా 885 గ్రాముల గంజాయి దొరికింది. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.


పోలీసుల అదుపులో నిందితులు

నిషేధిత గుట్కా పట్టివేత

జిన్నారం(పటాన్‌చెరు) : జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల పలు కిరాణా షాపుల్లో ఎస్‌ఐ దశరథ్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా దత్తు దుకాణంలో రూ.2 లక్షలు, రాకేశ్ దుకాణంలో రూ.80 వేలు, అంకుర్ అగర్వాల్ దుకాణంలో రూ.70 వేలు విలువ చేసే నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థిని

మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య


గాయత్రీ (ఫైల్)

తూప్రాన్: ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని దతార్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి 2 కథనం మేరకు.. దతార్‌పల్లి గ్రామానికి చెందిన బోసమైన మహేశ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు. పెద్ద కూతురు గాయత్రీ(17) గజ్వేల్ ప్రభుత్వ మోడల్ కళాశాలలో గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయింది. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటుంది. ఇటీవలె కళాశాలకు వెళ్లి టీసీ తెచ్చుకుంది. శుక్రవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లిన అనంతరం ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు గమనించి బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

సంతానం కలగడం లేదని..

వివాహిత ఆత్మహత్య

నారాయణఖేడ్: వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నాగల్‌గిద్ద మండలంలోని మావినెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ సాయిలు కథనం మేరకు.. మావినెల్లి గ్రామానికి చెందిన మారుతి మొదటి కూతురు అంబిక (22)ను రెండేళ్ల కిందట కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ సమీపంలోని బెలూర్ గ్రామానికి చెందిన సాగర్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. ఇటీవల సోదరుడి వివాహానికి హాజరై పుట్టింట్లోనే ఉంటుంది. పిల్లలు కావడం మనస్తాపానికి గురై చీరతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉద్యోగాల భర్తీకి డిమాండ్

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర

హుస్నాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగులకు బాసటగా నిలువాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. శనివారం పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు హాజరై మాట్లాడారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పలు రకాల డ్రగ్స్, గంజాయి, మత్తు పానీయాలను అరికట్టడానికి పిలుపునిచ్చారు. ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశాడు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ హుస్నాబాద్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ ప్రాంత యువత చెడు దారి పట్టకుండా ప్రభుత్వం ద్వారా చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపాతుల జనార్దన్, నాయకులు గోపి, శ్రీనివాస్, అంతయ్య తదితరులు ఉన్నారు.

పాత రోడ్డు కబ్జాకు యత్నం

చిన్నకోడూరు(సిద్దిపేట): పాతరోడ్డు కబ్జాకు రియాల్టర్లు యత్నించగా గ్రామస్తులు యత్నించారు. విషయానికొస్తే.. శనివారం సిద్దిపేటకు చెందిన రియల్ వ్యాపారులు ఇబ్రహీంనగర్‌లో ఉన్న పాత ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్దకు చేరుకుని అధికారులు పాతిన హద్దు రాళ్లను తొలగించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ప్రభుత్వ భూమిని కబ్జాకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుని పాత రోడ్డు యథావిధిగా ఉండేలా చూడాలని గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా, కొందరు రియల్టర్‌లు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చగా.. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు వాటిని తొలగించి పాత రోడ్డు హద్దులు పాతడం తెలిసిందే.


రియల్టర్‌లు హద్దు రాళ్ల తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు

రారెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు


జహీరాబాద్‌లోని రిపేర్ సెంటర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు

- నిత్యం కాలిపోతున్న వైనం
- మరమ్మతుల్లోనూ తీవ్ర జాప్యం
- కరెంట్ లేక ఎండుతున్న పంటలు
- రైతులకు తప్పని తిప్పలు


కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు చేపడుతున్న మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు భూగర్భ జలాలపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. శాశ్వత నీటి వనరులేక బోరు బావుల కింద పంటలన్నీ వేయడం వల్ల కరెంట్ వినియోగం ఎక్కువ. ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని బట్టి వ్యవసాయ కరెంట్ కనెక్షన్లు ఉంటాయి. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఎక్కువ కనెక్షన్లు ఉండటంతో ఓవర్ లోడ్, పవర్ సప్లయ్ లోపాలు, టెక్నికల్, వాతావరణ సమస్యల వల్ల అగ్రికల్చర్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడంతో మరమ్మతుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలతోపాటు అందోల్ మండలంలోని రాయికోడ్ మండలం నుంచి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను జహీరాబాద్ పట్టణంలో ఉన్న రిపేర్ సెంటర్‌కు తీసుకొస్తుంటారు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. జహీరాబాద్ సెంటర్‌కు సుమారు 300 వరకు రిపేర్‌కు వచ్చాయి. ఇందులో చాలా వరకు 25 కేవీ, 63 కేవీ, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. గ్రామాల్లోని సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పెద్ద సంఖ్యలో కాలుతున్నాయి.

వర్షాకాలం ప్రారంభమైన తర్వాత కూడా కరెంట్ సమస్యలు ఎక్కువయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలు, ఉరుములకు కరెంట్ సరఫరాలో తరచూ లోపాలు ఏర్పడ్డాయి. కరెంట్ తీగలు లూజ్‌గా ఉండడంతో ఈదురు గాలులకు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కరెంట్ సమస్యల కారణంగా బోరు మోటార్లు కూడా కాలుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిన తర్వాత మరమ్మతుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కార్మికులు ప్రతి రోజూ రెండు మాత్రమే మరమ్మతులు చేస్తున్నారు. ప్రస్తుతం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువ వస్తుండటంతో మరమ్మతులకు వారం రోజులు పడుతుంది.

ఐదు మండలాలకు రెండు వాహనాలు

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే గ్రామాల నుంచి రిపేరింగ్ సెంటర్ వరకు డిపార్ట్‌మెంట్‌కు చెందిన వాహనంలో తీసుకెళ్లి... మరమ్మతులు అయిన తర్వాత మళ్లీ తీసుకొచ్చి బిగించాల్సి ఉంటుంది. ఎక్కువ శాతం ఇలాగే జరుగుతుంది. ఐదారు మండలాలకు కలిపి ట్రాన్స్‌ఫార్మర్లను తరలించడానికి రెండు వాహనాలే ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో కూడా జాప్యం జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో రైతులే ట్రాక్టర్, ఆటోలను కిరాయికి మాట్లాడుకొని ట్రాన్స్‌ఫార్మర్లను జహీరాబాద్ రిపేర్ సెంటర్‌కు తీసుకొస్తుంటారు. వెహికల్ కిరాయి తదితర ఖర్చులు అన్నీ కలుపుకొని ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు మూడు వేల వరకు తమపై భారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

మూడు సార్లు కాలిపోయింది

కరెంట్ సరఫరాలో లోపంతోపాటు పిడుగులు పడి పొలం పరిధిలోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మూడు సార్లు కాలింది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి బిగించే వరకు సుమారు రెండు, మూడు నెలలు పట్టింది. వర్షాలు పడక కరెంట్ లేక పంటలకు నీరందక దెబ్బతిన్నాయి.

– నాగిశెట్టి, రైతు, హద్నూర్

ఈసారి ఎక్కువయ్యాయి

గతంతో పోల్చితే ఈసారి ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోయాయి. పిడుగులు పడడంతో ఈ సమస్య వచ్చింది. కారణాలు తెలుసుకొని కరెంట్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాం. రైతులకు ఇబ్బందులు రాకుండా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతులు చేసి ఇచ్చాం.

– లక్ష్మీనారాయణ, డీఈఈ, జహీరాబాద్